

సన్నాల సాగు పెరిగేనా?



- క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ప్రకటించిన ప్రభుత్వం
- రేషన్‌లో సన్నబియ్యం ఇచ్చేందుకు నిర్ణయం
- జిల్లాలో సాగు చేసేది 20 శాతమే

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

సన్న రకం వరి సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం సేకరణ సమయంలో క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్‌ను ప్రకటించింది. ఇప్పటికే పాఠశాలల్లో, హాస్టళ్లలో, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనాన్ని అందిస్తున్నది. వచ్చే జనవరి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సన్నబియ్యాన్నే సరఫరా చేయాలని నిర్ణయించింది. రైతులు సన్న వరి రకాల సాగును దాదాపుగా మానుకుంటున్న దశలో సన్న బియ్యంను ఇతర ప్రాంతాల నుంచి తీసుకురావాల్సి వస్తున్నది. రాష్ట్రానికి అవసరమైన సన్న బియ్యాన్ని ఇక్కడే పండించే విధంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రోత్సాహకరంగానే ఉన్నాయి. రైతులు ఎంత వరకు ముందుకు వస్తారన్నదే ప్రశ్నార్థకంగా మారింది.

● గతంలో ప్రోత్సహించినా ఆసక్తి చూపని రైతులు

ప్రస్తుతం సేకరిస్తున్న యాసంగి వరి ధాన్యంలో సన్న రకాలకు క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ చెల్లిస్తున్నది. జిల్లాలో వానా కాలం సుమారు 2,75,000 ఎకరాల నుంచి 3,00,000 ఎకరాల వరకు వరి సాగు అవుతుంది. యాసంగిలో రెండున్నర లక్షల ఎకరాలకు తగ్గకుండా వరి సాగు చేస్తారు. యాసంగిలో నీటి కొరత, ఎండ తీవ్రత కారణంగా ధాన్యం మరాడిస్తే నూకలు ఎక్కువగా వచ్చే అవకాశాలున్నందున రైతులు దొడ్డు రకాలను మాత్రమే సాగు చేస్తారు. వర్షాకాలం సాగులో సన్నరకాలను సాగు చేసినా 20 శాతానికి మించి సాగు జరుగడం లేదు. జిల్లావ్యాప్తంగా 5,500 ఎకరాల నుంచి 6,500 ఎకరాల వరకు మరీ ఎక్కువగా అయితే 10వేల ఎకరాలకు మించి సన్న వరి సాగు జరుగడం లేదు. మూడేళ్ల క్రితం ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం సన్న వరి రకాల సాగును ప్రోత్సహించినా కొనుగోలు సమయంలో సివిల్ సప్లయిస్ సంస్థ తిరకాసు పెట్టడంతో రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పండించిన ధాన్యాన్ని మద్దతు ధర కంటే తక్కు ధరకే వ్యాపారులకు అమ్ముకోవలసి వచ్చింది. ఆ తర్వాత ప్రభుత్వం చెప్పినా రైతులు దొడ్డు వరి సాగునే చేస్తూ వస్తున్నారు.ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ సన్నరకం వరి సాగును ప్రోత్సహించాలని నిర్ణయించింది.

● మార్కెట్‌లో మంచి డిమాండ్

రేషన్ బియ్యంగా సన్న రకాలనే సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రాష్ట్రంలో 25 లక్షల మెట్రిక్ టన్నుల మేరకు సన్నబియ్యం డిమాండ్ ఏర్పడింది. ఈ డిమాండ్ ఉన్న కారణంగా రైతులు సాగుకు ముందుకు వస్తారని ప్రభుత్వం ఆశిస్తున్నది. సన్న వరి రకాలు సాగు చేస్తే దొడ్డు రకానికంటే ఎక్కువ కాలం నీరు అందించాల్సిన అవసరముంటుంది. చీడపీడలు ఎక్కువగా వచ్చే అవకాశాలుంటాయి. దీంతో క్రిమిసంహారక మందుల కోసం ఎకరాకు అదనంగా 5 వేల రూపాయల మేరకు పెట్టుబడులు పెరుగుతాయి. దొడ్డురకాలతో పోలిస్తే ఎకరానికి మూడు నుంచి ఐదు క్వింటాళ్ల మేరకు దిగుబడి తక్కువ వస్తుంది. దీంతో రైతులు సన్న రకాల సాగుకు ముందుకు రావడం లేదు. ప్రస్తుతం ప్రభుత్వం క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ ప్రకటించడంతో ఎకరంలో పండే ధాన్యంపై 10 నుంచి 12వేల రూపాయలు అదనంగా వచ్చే అవకాశముండడంతో రైతులు ముందుకు వస్తారని భావిస్తున్నారు. పెట్టుబడి పెరుగడం, దిగుబడి తక్కువ రావడం బేరీజు వేసుకుంటే పెద్దగా లాభమేమి ఉండదని, అయినా ప్రభుత్వం కొనుగోలు సమయంలో కేంద్రంపై ఆధారపడకుండా ఉంటే తప్ప రైతులు ధాన్యం అమ్ముకునే విషయంలో ఇబ్బందులు పడాల్సి వస్తుందని భావిస్తున్నారు. రాష్ట్రంలో సన్నరకాలను తినే కుటుంబాలే 80 శాతానికిపైగా ఉండడంతో రైతులు సన్నరకాలను సాగు చేస్తేనే ఎక్కువ లాభపడుతారని, కొనుగోలు కేంద్రాలోనే కాకుండా బయట మార్కెట్‌లో అమ్ముకునేందుకు వీలవుతుందని కొందరు అంటున్నారు. సాంప్రదాయంగా దొడ్డు రకాలను సాగు చేస్తున్న రైతులు సన్న రకాల సాగుకు ఏమేరకు ముందుకు వస్తారో ఈ వానా కాలం సీజన్‌లో తేలిపోనున్నది.

12 వరకు ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు

- ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్‌రెడ్డి



10 జీపీఏ సాధించిన విద్యార్థులతో ఎమ్మెల్సీ, పీఆర్టీయూ బాధ్యులు

కరీంనగర్ టౌన్, మే 23: పాఠశాలల పునఃప్రారంభమయ్యే జూన్ 12 వరకు రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ఉంటాయని ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్‌రెడ్డి అన్నారు. గురువారం పీఆర్టీయూ టీఎస్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా అధ్యక్షుడు ముస్కు తిరుపతిరెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ 2010 సంవత్సరానికి ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ అవసరం లేదన్నారు. ప్రతి పాఠశాలకు సర్వీస్ వర్కర్స్‌ను ప్రభుత్వం నియమిస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారన్నారు. పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు మాట్లాడుతూ జిల్లాలో 84 ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించడం, 80 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించడం గొప్ప విషయమన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఈ కార్యక్రమానికి హాజరుకానీ ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులను పాఠశాలల పునఃప్రారంభం తర్వాత సన్మానించాలని నిర్ణయించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతోపాటు 10 జీపీఏ సాధించిన మెరిట్ విద్యార్థులను శాలువలు, మెమోంటోలతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి జైపాల్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు ఎల్ వెంకటేశ్వర్‌రావు, డి బాల్‌రెడ్డి, కె ఆనందం, కె వెంకటనర్సింహారెడ్డి, గడిపె సహోదర్, కె శ్రీనివాస్‌రెడ్డి, జలపతి, జీవన్‌రెడ్డి, వీఎల్ఎన్ మహేందర్‌రెడ్డి, ప్రేమలత, ముజీబ్, పవన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గీకురు రవీందర్

సుభాష్‌నగర్, మే 23: బీసీ కుల గణన చేపట్టిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వ హించాలని జడ్పీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గీకురు రవీందర్ అన్నారు. బుదవారం నగరంలోని ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మేనిఫేస్టోలో బీసీ కుల గణన చేపడతామని పొందు పరచడాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. దానికి అనుగుణంగా బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అసెంబ్లీలో తీర్మానం చేయడంపై బీసీ కులాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ పాంచ్ న్యాయ్ హామీల్లో ఒకటి సామాజిక న్యాయమని, ప్రతి వ్యక్తి, ప్రతి వర్గం సామాజిక, ఆర్థిక సమానత్వం కుల గణనతో సాధ్యం అనే అంశాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి బీసీ కులాలు ఘననీయంగా కృషి చేశాయన్నారు. గత బీఆర్ఎస్ ప్రబుత్వం బీసీ రిజర్వేషన్లు 23 శాతానికి తగ్గించి తీరని అన్యాయం చేసిందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కుల గణన చేపట్టిన అనంతరం దామాషా పద్ధతిలో బీసీ రిజర్వేషన్లు పెంచిన తరువాతనే ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. లేకపోతే బీసీల జనాబా దామాషా పద్ధతిలో కనీసం 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై జిల్లా కేంద్రంలో ఈనెల 30న సెమినార్ నిర్వహించి అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సెమినార్‌కు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. సమావేశంలో బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కోడూరి పరుశరాం, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్, జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేశ్‌చారి, జిల్లా ఉపాధ్యక్షుడు కాయితోజు బ్రహ్మచారి, విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బోయిని ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిరంతర విద్యుత్ సరఫరా



ప్రభుత్వ ఆసుపత్రి మాతా శిశు సంరక్షణ కేంద్రాలను తనిఖీ చేస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ గంగాధర్

గణేశ్‌నగర్, మే 23: ప్రబుత్వ ఆసుపత్రుల్లో నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రాలోని విద్యుత్ సరఫరా విధానాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రంలో విద్యుత్ సరఫరా చేయడానికి మూడు 11/కెవి సబ్ స్టేషన్లను ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్, డీఎంహెచ్‌వోతో కలిసి జనరేటర్లను తనిఖీ చేశారు. వాటిని ఎలా నిర్వహించాలనే విషయాన్ని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో డీఈ జె రాజం, టౌన్ ఏడీఈ నరేందర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయండి

- కలెక్టర్ పమేలా సత్పతి



గంగాధరలో ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

గంగాధర, మే 23: ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. గురువారం గంగాధర మార్కెట్ యార్డు, లక్ష్మీదేవిపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈనెల చివరి వరకు జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాలను పూర్తి చేయాలన్నారు. ఐకేపీ కేంద్రాల్లో కొనుగోళ్లు మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా కొనుగోళ్లు మందకొడిగా సాగుతుంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం అమ్మిన రైతులకు ఎప్పటికప్పుడు డబ్బులు చెల్లిస్తున్నామని చెప్పారు. జిల్లాలో రైతులు ఎక్కడా ఇబ్బందులు పడకుండా చూస్తున్నామని తెలిపారు. అధికారులు పకడ్బందీగా వ్యవహరిస్తూ ముందుకు సాగాలని సూచించారు. అంతకుముందు మండలంలోని ఆచంపల్లి, రంగరావుపల్లి పాఠశాలల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు పనులు పూర్తి చేయాలన్నారు. కరెంటు, సిమెంట్ పనులు జూన్‌5లోపు పూర్తి చేస్తే కలర్లు వేయడానికి అవకాశముంటుందన్నారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రజనీకాంత్, ఇన్‌చార్జి డీసీఎస్‌వో సురేష్ రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్‌కుమార్ ఉన్నారు.



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

దుర్గాభవానీ అమ్మవారికి సహస్ర దీపారాధన

కరీంనగర్ రూరల్, మే 23: కరీంనగర్ మండలంలోని నగునూరు గ్రామంలోని దుర్గా భవానీ అమ్మవారి ఆలయంలో గురువారం పౌరమి సందర్బంగా అమ్మవారికి వేద పండితుడు పురాణం మహేశ్వర శర్మ ఆద్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పవన్‌కృష్ణ శర్మ అమ్మవారికి పల్లకిసేవ, ఊయలసేవ, సహస్ర దీపారాధన, విశేష హారతి, పూజా కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. ఈ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకుడు

అస్తవ్యస్తంగా రోడ్డు విస్తరణ పనులు

- అధికారుల పర్యవేక్షణ కరువు

వీణవంక, మే 23: వీణవంక-జమ్మికుంట మధ్య నిర్మిస్తున్న నాలుగు వరుసల రోడ్డు నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. వీణవంక జమ్మికుంటకు నాలుగు వరుసల రోడ్డు కోసం 2016లో నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికీ కొనసాగుతున్నాయి. జమ్మికుంట నుంచి వల్బాపూర్ గ్రామం వరకు రోడ్డు వేసి మిగిత పనులు వదిలి పెట్టారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు వీణవంక నర్సింగాపూర్ గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం 29 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసింది. దీంతో పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి. దాదాపు ఆరు నెలలు గడిచినా పదిశాతం పనులు కూడా పూర్తికాలేదు. ప్రతియేటా వర్షకాలంలో నర్సింగాపూర్ వీణవంక గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణం చేయక పోవడంతో రోడ్డు పై నుంచి నీరు పారుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా నాణ్యతలేని మట్టి పోస్తున్నారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారు. రోడ్డు వంద ఫీట్ల మేర నిర్మించాల్సి ఉండగా ఓక్కో చోట ఓక్కో రకంగా పనులు చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పనులను పర్యవేక్షించాలని ప్రజలు కోరుతున్నారు.



నర్సింగాపూర్-వీణవంక గ్రామాల మధ్య కొనసాగుతున్న పనులు

మెరిసిన తెల్ల బంగారం

- వారం రోజుల వ్యవధిలో రూ. 500 పెరిగిన పత్తి ధర



జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన పత్తి

జమ్మికుంట, మే 23: జమ్మికుంట వ్యవసాయ మార్కె ట్లో తెల్ల బంగారం మెరిసింది. క్వింటాల్‌కు గరిష్ఠంగా 7,550 రూపాయలు పలికింది. వారం క్రితం క్రమంగా తగ్గిన పత్తి ధర క్వింటాల్‌కు 7,050 రూపాయలకు చేరుకుంది. ప్రభుత్వ మద్ధతు ధర 7,020 ఉండగా, ఆ సమయంలో ప్రైవేట్ ట్రేడర్స్ 30 రూపాయలు మాత్రమే ఎక్కువ చెల్లించి పత్తి కొన్నారు. ఫిబ్రవరిలో మద్ధతు ధర కన్నా ఎక్కువ ధర పలుకడంతో కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి కొనుగోళ్లను నిలిపి వేసింది. అప్పటి నుంచి ప్రైవేట్ ట్రేడర్స్ వేలం ద్వారా పత్తి కొంటున్నారు.కొద్ది రోజులుగా మార్కెట్‌కు సుమారు మూడు వందల క్వింటాళ్ల లోపు పత్తిని రైతులు విక్రయానికి తీసుకు వస్తున్నారు. పత్తి ధర తగ్గిన సమయంలో 50 నుంచి 70 క్వింటాళ్ల లోపు మాత్రమే పత్తిని విక్రయానికి తెచ్చారు. ప్రస్తుతం ధరలు ఆశాజనకంగా ఉండడంతో వానాకాలం పెట్టుబడుల కోసం రైతులు తమ ఇళ్లలో నిల్వ చేసుకున్న పత్తిని విక్రయించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో గురువారం పది మంది రైతులు 120క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర 7,550, కనిష్ఠ ధర 6,700 రూపాయలు చెల్లించి కొన్నారు.

26 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



సైదాపూర్ పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం

సైదాపూర్, మే 23: సైదాపూర్ మండల కేంద్రం నుంచి ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న 26 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్న పోలీసులు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. గురువారం తెల్లవారు జామున పెట్రోలింగ్ చేస్తున్న పోలీసుల ను చూసి వెంకటేశ్వర్లపల్లి గ్రామ శివారులో టీఎస్08 యూబీ 3009 నంబర్ గల ట్రాలీ వాహనాన్ని రోడ్డుపై వదిలి కొందరు వ్యక్తులు పరారయ్యారు. ఆ వాహనాన్ని తనిఖీ చేయడంతో అందులో 26 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం కనిపించాయి. వాహనం నంబర్ ఆధారంగా విచారించగా చిగురుమామిడి మండలం బొమ్మన పల్లికి చెందిన వల్లెపు అనిల్, బత్తుల కుమార్ అనే వ్యక్తి వద్ద నుంచి బియ్యాన్ని బీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌కు తరలిస్తున్నట్లు తెలిసింది. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సైదాపూర్ ఎస్ఐ జన్ను ఆరోగ్యం తెలిపారు.

రవ్వా శ్రీహరి జీవన సాఫల్య పురస్కారానికి

నలిమెల భాస్కర్ ఎంపిక

ఈ నెల 26న హైదరాబాద్‌లో ప్రదానం



కరీంనగర్ కల్చరల్, మే 23: ఆచార్య రవ్వా శ్రీహరి సంస్కృతాంధ్రపరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 26న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, ఎన్‌టీ ఆర్ స్టేడియంలో జరిగే ఆచార్య రవ్వా శ్రీహరి జీవన సాఫల్య పురస్కారానికి తెలుగు భాషా సాహిత్యంలో విశేష పరిశోధనకు జిల్లా కేంద్రానికి చెందిన బహుభాషావేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్ ఎంపికయ్యారు. ఈ మేరకు సమన్వయ కర్త ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు, కార్యదర్శి డాక్టర్ అప్పం పాండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పురస్కారం కింద 50 వేల రూపాయల నగదు బహుమతి అందించనున్నారు. ముఖ్య అతిథిగా పాట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్ నర సింహారెడ్డి, అతిథులుగా విశ్వనాథ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ వెలిచాల కొండలరావు, పాత్రికేయుడు కె రామచంద్ర మూర్తి, రిటైర్డ్ ప్రొఫెసర్ ఆచార్య కసిరెడ్డి వేంకటరెడ్డి, పూర్వ సంస్కృత శాశా ధ్యక్షుడు ఆచార్య ఎ రాములు, సాహితీ పరిశోధకుడు డాక్టర్ శ్రీరంగాచార్య, ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాద కులు డాక్టర్ కె శ్రీనివాస్, ఆయుర్వేద వైద్య పరిశోధకుడు డాక్టర్ భాగవతం రామారావు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ (యుఎస్ఏ) రవ్వా రమేశ్ హాజరుకానుండగా ప్రొఫెసర్ కె యాదగిరి అధ్యక్షత వహించనున్నారన్నారు. సుమారు 14 భాషల్లో ప్రావీణ్యం సాధించిన వ్యక్తిగా, విశ్రాంత తెలుగు అధ్యాపకులుగా, నిత్య పరిశోధకు లుగా ఉంటున్న కవి, రచయిత డాక్టర్ భాస్కర్‌కు ఈ పురస్కారానికి ఎం పిక కావడం పట్ల ఉమ్మడి జిల్లాకు చెందిన కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు అభినందనలు తెలియ జేస్తూ హర్షం వ్యక్తం చేశారు.

సెలవులో రాజన్న ఆలయ ఈవో

ఇన్‌చార్జి ఈవోగా రామకృష్ణ



వేములవాడ టౌన్, మే 23 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ ఈవో కృష్ణప్రసాద్ అనారోగ్యం కారణంగా 15 రోజులు సెలవులో వెళ్లారు. దేవాదాయ శాఖలో రీజనల్ జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న రామకృష్ణకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో గురువారం రాజన్న ఆలయానికి వచ్చిన రామకృష్ణ బాధ్యతలు చేపట్టారు. అనంతరం రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నా రు. ఈ సందర్భంగా ఆలయ ఏఈవో ప్రతాప నవీన్ ప్రసాదం అందజేశారు. సూపరిం టెండెంట్‌లు సిరిగిరి శ్రీరాములు, నర్సయ్య, అశోక్ ఉన్నారు.

ఇన్‌చార్జి వీసీని కలిసిన ఎస్‌యూ అధికారులు



ఎస్‌యూ ఇన్‌చార్జి వీసీకి అభినందనలు తెలుపుతున్న యూనివర్సిటీ అధికారులు

గణేశ్‌నగర్,మే 23: శాతవాహన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకుల పతిగా బాధ్యతలు స్వీకరించిన కె సురేంద్ర మోహన్‌ను గురువారం సచివాలయంలో రిజిస్ట్రార్ ఆచార్య వరప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రసాద్, ఫైనాన్స్ ఆఫీసర్ రవీందర్ తదితరులు కలిసి అభినందనలు తెలిపారు. సురేంద్ర మోహన్ ప్రస్తుతం రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ విభాగానికి కార్యదర్శిగా ఉన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అధికారులు ఇన్‌చార్జి వీసీతో పలు అంశాలపై చర్చించారు. విద్యార్థులకు ఉపయోగపడేలా యూనిర్సిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేయనున్నట్లు ఇన్‌చార్జి వీసీ సురేంద్ర మోహన్ తెలిపారని వారు తెలిపారు.

పరీక్షల షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్,మే 23: శాతవాహన యూనివర్సిటీ బీఈడీ ఒకటవ సెమిస్టర్, ఎంఈడీ ఒకటవ, మూడో సెమిస్టర్, ఎల్.ఎల్.బి ఒకటో సెమిస్టర్‌లకు సంబం ధించిన పరీక్షల తేదీలను యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ విడుదల చేశారు. దీనికి సంబంధించిన వివరాలు యూని వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.


షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం


రూ.5 లక్షల నష్టం

ఎల్లారెడ్డిపేట, మే 23:జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో గురువారం విద్యుత్ తీగలు చెట్ల కొమ్మలకు తాకడంతో ప్రమాదం సంభవించింది. ఈ సంఘటనలో ఆ ప్రాంతంలోని సుమారు 30 ఇళ్లలోని గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. భారీ శబ్దంతో ఒక్క సారిగా మంటలు ఎగిసి పడడంతో ఇళ్లలోని టీవీలు, కూలర్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మిషన్లు, ఫ్యాన్లు కాలిపోయాయి. సుమారు రూ.5లక్షల నష్టం వాటిల్లిందని బాధితులు పేర్కొన్నారు. విద్యుత్ తీగలు ఒకదానికి ఒకటి తాకడంతో ఇళ్లలోని పరికరాలు కాలిపోయాయని పేర్కొన్నారు. చెట్ల కొమ్మలకు దగ్గరలో ఉన్న తీగలను సరి చేయాలని పలుమార్లు సంబంధిత శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తీగలను సరి చేయడంతోపాటు తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.

ఆసుపత్రిలో అగ్నిప్రమాదం

కరీంనగర్ క్రైం, మే 23: కరీంనగర్ కోర్టు సమీపంలోని లైఫ్‌లైన్ హాస్పిటల్‌లో బుధవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆసుపత్రి ఎలివేషన్ బోర్డులో మంటలు అంటుకున్నాయని కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే ఫైరింజన్‌తో సహా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేసినట్లు తెలిపారు. స్వల్ప నష్టం వాటిల్లగా ఎవరికీ ప్రమాదం జరగలేదని తెలిపారు.


ఎలగందల్ కోట




కోటలో ఉన్న ఫిరంగి

'ఎలగందల్'కు ఆదరణ ఏదీ?

భగత్‌నగర్, మే 23: ఎలగందల్ కోట పర్యాటక శోభితం.. నిరాదరణకు గురవుతున్న కళా కట్టడం.. కాకతీయుల కళా చిహ్నంగా నిర్మితమైన కోట.. పంచరాజవంశీయుల పాలనలో విలసిల్లింది. అలనాటి జిల్లా కేంద్రం... నిజాం పరిపాలనలో ఎలగందల్ కోటలోనే ప్రధాన కార్యాలయం... పర్యాటకంగా ఎంతో విశిష్టత ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో కళాచిహ్నం నిరాదరణకు గురవుతున్నది. కరీంనగర్ జిల్లా కేంద్రానికి ఆనుకుని మానేరు నది ఒడ్డున ఉన్న ఎలగందల్ గ్రామంలోని కోట చారిత్రాకంగా గుర్తింపు పొందింది. కాకతీయులు, కుతుబ్‌షాహీ వంశీ యులు, మొఘల్ సామ్రాజ్యం, హైదరాబాద్ నిజాం, ఆసఫ్‌జాహీల పాలనలో విలసిల్లిన ఎలగందల్ కోటపై పట్టింపుకరువైంది. ఆంధ్ర ప్రదేశ్ సమైక్యరాష్ట్రంలో ఎలగందల్ కోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు యాభై లక్షల రూపాయలు కేటాయించారు. సంవత్సరం పాటు పర్యాటక శాఖ వారు లైటింగ్ ఏర్పాటు చేసి పర్యాటకులను ఆకర్షించే విధంగా లైటింగ్ సౌండ్ సిస్టం ఏర్పాటు చేయడంతో కొంత మేర పర్యాటకులు ఎలగందల్ కోటను వీక్షించేందుకు వందల సంఖ్యలో తరలి వచ్చేవారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పిడుగు పాటుకు ప్రొజెక్టర్‌లు చెడిపోయాయి.

పురాతన జ్ఞాపక చిహ్నాలు


ఎలగందల్ కోటలో పురాతన జ్ఞాపక చిహ్నాలు ఎన్నో ఉన్నాయి. కొండ శిఖరాన ఉన్న ఎత్తైన కోట, తూర్పు ద్వారానికి వెలుపల ఉన్న బృందావన సరస్సు 1774లో ఫాఫర్-ఉద్-దౌలా చేత నిర్మించబడినది. ముస్లిం సన్యాసులైన సయ్యద్ షాహ, మునావర్ క్వాద్రి సాహెబ్, దులా షాహ సాహెబ్, సయ్యద్ మరూఫ్ సాహెబ్, షాహ తాలిబ్ బిస్మిల్లా సాహెడ్ వాలి హైదర్ సాహెబ్ సమాధులు కదిలిస్తే కొండ మీద ఉన్న మినార్‌లు ఊగుతాయని నానుడి. గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న మరో రెండు మినార్లు నిజాం రాజులు నిర్మించారు. ఈ మినార్లు ఎక్కడానికి లోపలి నుంచి మొట్లు ఉంటాయి. వీటితో పాటు ఎలగందల్‌కోట నుంచి మానకొండూర్ వరకు 9 కిలోమీటర్ల మేర రహస్య సొరంగ మార్గం ఉందని ఇప్పటికీ ప్రజలు నమ్ముతారు.

పర్యాటకులకు రక్షణ కరువు

ఎలగందల్ కోటను చూడడానికి నిత్యం పర్యాటకులు వస్తున్నా అధికారులు మాత్రం రక్షణ చర్యలు చేపట్టడంలో విఫమయ్యారనేది వాస్తవం. ఎలగందల్ కోటను చూడానికి లోపలికి వెళ్లిన వారు కోట పైన చిన్నా పెద్ద ఎవరికి ఇష్టం వచ్చినట్ల వారే తిరిగి రావాల్సిందే. కోట పైభాగంగా రక్షణ చర్యలు ఏం లేకపోవడం విమర్శలకు తావు ఇస్తున్నది. పర్యాటకుల రక్షణ కోసం కోటపై భాగంలో చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

పంచరాజవంశీయుల పాలన

ఎలగందల్‌ను ప్రధాన కేంద్రంగా చేసుకుని ఐదుగురు రాజవంశీయులను ఎలగందల్ కోట నుంచి పాలన కొనసాగించారు. 1083-1323 సంవత్సరం మధ్య కాలంలో కాకతీయుల రాజవంశీయులు ఎలగందుల కోటను నిర్మించారని చరిత్ర పాటాలు చెబుతున్నారు. యోధులైన ముసు నూరి నాయక్, రాచర్ల పద్మనాయక్‌లు ఎలగందల్ కోటను దృఢంగా చేశారు. 16వ శతాబ్ధంలో కుతుబ్‌షాభి వంశస్తులు కోటను ఆక్రమించుకుని క్యుయినముల్‌ఉల్‌ను కమాండర్‌గా నియమించారు. అనంతరం మొఘల్ సామ్రాజ్యం ఆధీనంలోకి వెళ్లి పోయింది. ఆ తర్వాత హైదరాబాద్ నిజాం ఉల్‌ముల్క్ నిజాం ఉల్ ముల్క్ నిజాం ఆసఫ్షాహ 1724-1748 వరకు ముగ్రాబ్ హయాంలో అమీన్‌ఖాన్ ఎలగందల్‌కు ఖిలేదార్‌గా నియమించ బడ్డాడు. నవాబ్ సలాబత్ జంగ్ హయాంలో మిర్జా ఇబ్రహీం దంసా ఖిలేదార్ అయ్యాడు. సికందర్ ఝా 1803-1823 వరకు పాలించాడు. 1754 సంవత్సరంలో దంసా ఈ కోటను పునర్నిర్మాణం చేసినట్లు చరిత్ర చెబుతున్నాయి. బహదూర్‌ఖాన్, కరీముద్దీన్‌లు తరువాతి కాలంలో ఖిలేదారులుగా పనిచేశారు. ఎలగందల్ ఖిలేదారుగా పనిచేసిన కరీముద్దీన్ పేరు మీదనే కరీంనగర్ మారినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. 1905 సంవత్సరంలో జిల్లాల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా ఆరవ నిజాం మహబూబ్ అలీఖాన్ జిల్ల కేంద్రాన్ని ఎలగందల్ నుంచి కరీంనగర్ మార్చారు.


మినార్

నైసర్గిక స్వరూపం

కరీంనగర్ జిల్లా కేంద్రానికి 10కిలో మీటర్ల దూరంలో ఉండి మానేరు నదీ తీరాన ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2016లో జిల్లాల పునర్ వ్యవస్థీరణలో భాగంగా ఈ గ్రామం కరీంనగర్ మండలం నుంచి కొత్తపల్లి మండలంలోకి మార్చారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 997 ఇళ్లతో 3,937 జనాభా, 1,720 హెక్టార్లలో విస్తరించి ఉంది.

● కాకతీయుల కాలం నుంచి నిజాం రాజ వంశీయులు ఆసంజాహీ వంశీయుల వరకు ఎలగంగల్ కోట నిత్యం కళా వైభవాన్ని చాటినప్పటికీ నేడు కళా విహీనంగా తయారై నిరాదరణకు గురవుతున్నది. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎలగంగల్ కోట అభివృద్ధిపై దృష్టి సారించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉన్నది.



ఎలగందల్ కోట ముఖద్వారం

తెల్లకందుల.. వెలగందుల.. ఎలగందుల

పూర్వం ఈ ఊరి పేరు బహుధాన్యా నగరం. కాకతీయుల కాలం నుంచి ఎలిగందులగా పిలువబడుతున్నది. ఎలగందుల గ్రామం చుట్టు ప్రాంతాల్లో ఎక్కువగా తెల్ల కందులు పండేవని ప్రసిద్ధి. దీంతో ఈ గ్రామానికి రాను రాను తెల్లకందుల పోయి ఎలగందల గ్రామం పేరు స్థిరపడిందనే చరిత్ర నానుడిలో ఉంది. తెల్లకందుల అన్న పేరు చింతామణి చెరువు వద్ద ఉన్న శాసనంలో స్పష్టంగా చెక్కబడి ఉంది. కొంత మంది మొదటి వెలగందుల గ్రామంగా ఉన్న పేరుకాస్త ఎలగందులగా స్థిరపడిందని చెప్పుకుంటుంటారు.

శత్రు దుర్భేద్యమైన కోట

ఎలగందల్‌కోటను పాలించిన రాజులు శత్రు దుర్భేద్యంగా నిర్మించు కున్నారు. శత్రువుల భారి నుంచి కోటను, దాడుల నుంచి కాపాడుకోవ డానికి ఎలగందల్ పాలకులు కోట చుట్టు ఐదుమీటర్ల (16అడుగుల) వెడల్పు 4 మీటర్లు (13 అడుగులు) లోతుతో పెద్ద పెద్దకందకాలు కోట చుట్టూ తవ్వి కందుకంలో రక్షణ కోసం మొసళ్లను వదిలి రక్షణ పొందే వారని చరిత్ర చెబుతున్నది.



కోటిలింగాల గోదావరి వద్ద పారిశుధ్య లోపం

● పుష్కర ఘాట్లపై పేరుకు పోయిన చెత్త ● గోదావరిలో స్నానాలకు ఇబ్బంది పడుతున్న భక్తులు ● పట్టించుకోని అధికారులు


ఘాట్లపై భక్తులు వదిలి పెట్టిన దుస్తులు, వ్యర్థ పదార్థాలు

వెల్గటూర్, మే 23: ప్రసిద్ధ శైవ క్షేత్రం కోటిలింగాల వద్ద గోదావరి నదిలో పారిశుధ్యం లోపించింది. పుష్కర ఘాట్లపై ఎక్కడ చూసినా భక్తులు వదిలిన పాత బట్టలు, వ్యర్థ పదార్థాలు దర్శనమిస్తున్నాయి. దీనితో గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించడానికి వచ్చిన భక్తులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొద్ది రోజుల క్రితం వరకు ఎల్లంపల్లి ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో గోదావరి కళకళలాడేది. అప్పుడు భక్తులు పుష్కర ఘాట్ల వద్ద స్నానాలు చేసేవారు. పాత బట్టలను గోదావరిలో వదిలి పెడితే తమకు ఉన్న దోషాలు పోతాయని నమ్మే భక్తులు తమ వద్ద ఉన్న పాత దుస్తులను గోదావరిలో వదిలి పెట్టారు. స్నానాలు చేయడానికి గోదావరిలో దిగిన భక్తులకు నీటిలో తేలిన పాత దుస్తులు తమకు తగిలే సరికి స్నానాలు చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం తీవ్రమైన ఎండలకు గోదావరి లో నీటి మట్టం తగ్గింది. ఈ క్రమంలో భక్తులు వదిలి పెట్టిన దుస్తులు, వ్యర్థ పదార్థాలు పుష్కర ఘాట్లపై దర్శనమిస్తున్నాయి.

వ్యయ ప్రయాసలకు ఓర్చుకొని దూర ప్రాంతాల నుంచి పుణ్య స్నానాలు ఆచరించడానికి వచ్చిన భక్తులు గోదావరిలో, పుష్కర ఘాట్లపై పడి ఉన్న చెత్తను చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై మండి పడుతున్నారు. పుష్కర ఘాట్లపై పాత దుస్తులు ఎక్కడ పడితే అక్కడ పడి ఉండి పారి శుధ్యం లోపించినా పట్టించుకున్నాథుడు లేడు. ఆలయ అధికారులు, పంచాయితీ అధికా రుల సమన్వయ లోపంతో పారిశుధ్యం ఎక్కడ వేసిన చెత్త అక్కడే అన్న చందంగా మారిం ది. ఇప్పటికైనా పాలకులు, సంబంధిత అధికారులు స్పందించి గోదావరిలో తేలిన చెత్తతో పాటు పుష్కర ఘాట్లపై ఉన్న వ్యర్థ పదార్థాలను వెంటనే తొలగించాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లి పారిశుధ్య చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. గోదావరిలో తేలిన చెత్తా చెదా రంపై ఆలయ ఈవో కాంతారెడ్డి, పంచాయితీ కార్యదర్శి కరుణాకర్ లను 'ఆంధ్రజ్యోతి' వివ రణ కోరగా రెండు, మూడు రోజుల్లోనే గోదావరి విపరీతంగా తగ్గడంతో భక్తులు వదిలి పెట్టిన వ్యర్థ పదార్థాలు తేలాయని వాటిని తొలగించడానికి చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

రాష్ట్రంలోనే జిల్లాను ఆదర్శంగా నిలపాలి

ప్రజారోగ్య శాఖ సంచాలకుడు డాక్టర్ రవీంద్రనాయక్


మాట్లాడుతున్న రవీంద్రనాయక్

సిరిసిల్ల, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై వైద్యాధికారులు పూర్తి అవగాహనతో ఉండాలని, ఫైర్ సేఫ్టీ, వేస్ట్ మేనేజ్‌మెంట్ అమలు పరచడంతో పాటు వాటి లక్ష్యాలను సాధించి రాష్ట్రంలోనే రాజన్న సిరిసిల్ల జిల్లాను ఆదర్శంగా నిలపాలని ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ రవీంద్రనాయక్ దిశానిర్దేశం చేశారు. గురువారం జిల్లాలోని తంగళ్లపల్లి మండలం నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అందిస్తున్న సేవలను ఆన్‌లైన్ ద్వారా రిపోర్టు చేయాలని తెలిపారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఉండాలన్నారు. కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ ఉంటుందని, దీనిపై అందరూ అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సుమన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రజిత, డీపీవో ఉమాదేవి, డాక్టర్ నయాంజాన్, ఏవో సీహెచ్ శ్రీనివాస్, రాజ్‌కుమార్, కార్తీక్, బాలయ్య, సురేష్, లింగం తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన నరసింహుడి ఆలయం


క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ధర్మపురి, మే 23: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో గురువారం కిటకిటలాడాయి. వైశాఖ శుద్ధ పౌర్ణమి తోడుగా సెలవు దినాలు కావటంతో దూర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు క్షేత్రానికి తరలి వచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ ఆలయాలకు భక్తులు చేరుకున్నారు. భక్తులు వివిధ రకాల పూజల టికెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కల్యాణం పూజలు చేయించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ, అర్చకులు పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తిగీతాలతో ప్రతి ధ్వనించాయి. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ నేతృత్వంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఎండ తీవ్రతపై భక్తుల దాహార్తీ తీర్చడం కోసం ఆలయం పక్కాన చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆలయ సూపరింటెండెం ట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి, వేదపారాయణ దారుపాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ,బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్ కుమార్, రాజగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

భూ వివాదంలో ఒకరి రిమాండ్

వేములవాడ టౌన్, మే 23 : భూ వివాదంలో అల్వాల్‌కు చెందిన ఇనుగంటి శ్రావణ్ రావును రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి గురువారం తెలిపారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గురువారం వివరాలు వెల్లడించారు. వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామానికి చెందిన కొంపల్లి విజయకు తనది కానిని భూమిని ముస్తాబాద్ మండలం ఆవునూర్‌కు చెందిన మంత్రి రఘు రూ.20 లక్షలకు విక్రయించాడు. కొంత భూమిని మాత్రమే రిజిస్ట్రేషన్ చేశాడు. మిగతా భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని కోరగా నక్సలైట్‌నని, డబ్బులు అడిగితే చంపేస్తానని బెదిరించాడు. ఈ విషయంలో గతంలోనే రఘుని రిమాండ్‌కు తరలించారు. ఇటీవల రఘుకు సహకారంగా అల్వాల్‌కు చెందిన ఇనుగంటి శ్రావణ్‌రావు మరో వ్యక్తి డబ్బుల విషయం మర్చిపోవాలని విజయను బెదిరింపులకు గురి చేశారు. బాధితురాలి ఫిర్యాదుతో శ్రావణ్‌రావుపై కేసు నమోదు చేసి కోనరావుపేట మండల పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో నిందితులకు సహకరించిన పలువురిపై దర్యాప్తు కొనసాగుతోందని ఇనుగంటి శ్రావణ్‌రావు ద్వారా ఎవరైనా మోసపోతే పోలీసులను సంప్రదించాలని డీఎస్పీ సూచించారు.

నకిలీ డాక్యుమెంట్స్ వ్యవహారంలో మరొకరు

సిరిసిల్ల క్రైం: భూమి వ్యవహారంలో నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించి రిజిస్ట్రేషన్ చేయకుండా మోసానికి పాల్పడిన సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్‌కు చెందిన రాగుల రాములును గురువారం రిమాండ్‌కు తరలించామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని పద్మనగర్‌లోని సర్వే నంబరు 960 బై బీలో 363 చదరపు గజాల భూమిని ఎల్లారెడ్డిపేటకు చెందిన ఉప్పుల నారాయణకు 10 సంవత్సరాల క్రితం రూ.3 లక్షలకు విక్రయించాడు.భూమికి హద్దులు చూపించకపోవడంతో అనుమానం వచ్చిన నారాయణ తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాడు. ఆ భూమి ప్రభుత్వానికి చెందినదిగా రికార్డు అయ్యిందని తేలింది. మోసపోయినట్లు తెలుసుకున్న నారాయణ సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో రాములుపై చీటింగ్ కేసు నమోదు చేశామని, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు. రాములుపై ఇప్పటికే 20 కేసులు నమోదయ్యాయని, ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

కారు బైక్ ఢీ.. ఒకరికి గాయాలు

శంకరపట్నం, మే 23: శంకరపట్నం మండలం ఆముదాపల్లి గ్రామంలో కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. ఆముదాలపల్లికి చెందిన గురువారం పుట్టపాక సమ్మయ్య బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో సమ్మయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. ఈఎంటీ సతీష్‌రెడ్డి, పైలట్ ఖాజాఖలీల్ ప్రథమ చికిత్స అందించి కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

తల్లి మందలించిందని యువకుడి ఆత్మహత్య


తరుణ్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మే 23 : ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో పనులు చేయకుండా తిరిగితే బతకడం ఎట్లా? అని తల్లి మందలించడంతో మనస్తాపం చెందిన యువకుడు న్యాలపల్లి తరుణ్ (22) గురువారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని జ్యోతి- శ్రీనివాస్ నిరుపేద దంపతుల చిన్న కొడుకు తరుణ్. పదో తరగతి వరకు చదివి మధ్యలోనే మానేశాడు. గ్రామంలోని టీవీ కేబుల్ సెంటర్‌లో దినసరి కూలీగా పని చేసేవాడు. కొద్దిరోజులుగా ఆ పనికి వెళ్లకుండా ఖాళీగా ఉంటున్నాడు. ఈ క్రమంలో కూలీ పనులు చేసినా పూట గడవడం గగనమవుతోందని, ఏదైనా పని చూసుకోవాలని తల్లి జ్యోతి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన తరుణ్ ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయాడని నిర్ధారించారు. మృతుడి తల్లి జ్యోతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం స్థానికులు విరాళాలు పోగు చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

నీటిలో మునిగి వ్యక్తి మృతి

సుల్తానాబాద్, మే 23 : బావిలో పడిపోయిన మోటార్‌ను తీయడానికి ప్రయత్నించిన ఓ వ్యక్తి నీటిలో మునిగి చనిపోయాడు. సుల్తానాబాద్ పట్టణంలోని గడిమహల్‌కు ఖాజావలి ఇంటిలోని బావిలో మోటార్, పైపులు పడిపోయాయి. వాటిని తీయడం కోసం మండలంలోని కనుకులగాంధీనగర్ గ్రామానికి చెందిన కొండపలకల అలియాస్ గట్టు శంకర్(54) అనే వ్యక్తిని తీసుకువచ్చాడు. శంకర్ బావిలో దిగి ముందు ఒకసారి లోపలి నుంచి పైపులు తీసుకొచ్చి అందించాడు. రెండోసారి మోటార్ కోసం దిగిన శంకర్ తిరిగి పైకిరాలేదు. దాంతో ఆందోళన చెంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అలాగే పెద్దపెల్లి అగ్నిమాపక దళ సిబ్బందికి కూడా సమాచారం అందించడంతో వారు వచ్చి నిచ్చెన సాయంతో బావిలోంచి శంకర్ మృతదేహాన్ని బయటకు తీసుకువచ్చారు.

పనికి తీసుకువచ్చిన వ్యక్తి ఇంటి ఎదుట ఆందోళన

బావిలో నుంచి మోటార్ కోసం గట్టు శంకర్‌ను తీసుకొనివచ్చిన ఖాజావాలి ఇంటి ఎదుట మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ కనుకుల గాంధీనగర్ నాయకులు, గ్రామస్థులు డిమాండ్ చేశారు. సంఘటనా స్థలానికి సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రవణ్ కుమార్‌లు చేరుకుని తెలుసుకుని వారిని సముదాయించారు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

నిద్రలోనే మృత్యు ఒడికి..

ఇటుకబట్టీ షెడ్ వద్ద విద్యుదాఘాతంతో తల్లీకూతుళ్ల మృతి


బేని బిందాని మృతదేహం


బాబి బిందాని మృతదేహం

కరీంనగర్ క్రైం, మే 23 : పొద్దంతా ఇటుకబట్టీలో పనిచేసిన తల్లీ బిడ్డలు అక్కడే యజమాని తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్‌లో రాత్రి నిద్రిస్తుండగా విద్యుదాఘాతంతో దుర్మరణం చెందారు. కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామ పరిధిలో లక్ష్మి ఇటుకలబట్టీ వద్ద షెడ్‌లో నివాసం ఉంటున్న ఒడిస్సా రాష్ట్రం నవరంగపూర్ జిల్లా పక్కన్ గూడ గ్రామానికి చెందిన బేని బిందాని(36), బాబి బిందాని(18)లు విద్యుదాఘాతంతో గురువారం వేకువజామున నిద్రలోనే మృతి చెందారు.

ఒడిస్సాకు చెందిన విద్యాధర్ బిందానికి ఇద్దరు భార్యలుండగా పెద్ద భార్య బేని బిందాని, ఆమె కూతురు బాబి బిందాని, కొడుకు ధశరథ్ బిందానిలు కొంత కాలంగా లక్ష్మి ఇటుకల బట్టీలో పని చేస్తూ ముగ్గురు అక్కడే తాత్కాలిక షెడ్‌లో నివాసం ఉంటున్నారు. విద్యాధర్ బిందాని తన చిన్న భార్యతో కలిసి మరొక ఇటుకబట్టీలో పనిచేస్తూ మరోచోట ఉంటున్నాడు. బేని బిందాని, ఆమె కూతురు బాబి బిందాని, కొడుకు ధశరథ్‌బిందానిలు బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇటుకబట్టీలో పనిచేసి అనంతరం వారి గదిలో భోజనం చేసి రాత్రి 9 గంటలకు నిద్రించారు. అర్ధరాత్రి తరువాత గాలివానకు గదిలోని విద్యుత్‌వైర్ తెగి గది ఇనుప తలుపుపై పడింది. తలుపునకు సమీపంలో నిద్రిస్తున్న బాబి బిందాని నిద్రలో ఇనుప తలుపునకు చేయి తాకగానే ఆమె విద్యుదాఘాతానికి గురికాగా, ఆమె పక్కనే నిద్రిస్తున్న తల్లి బేని బిందానికి కూడా విద్యుత్‌షాక్ తగిలింది. ఇద్దరూ నిద్రలోనే మృతి చెందారు. పక్కనే ఉన్న కొడుకు ధశరథ్ బిందానికి ఏమీ కాలేదు.

గురువారం వేకువ జామున ఇటుకబట్టీలో పనిచేసే తోటి కార్మికుడు జగన్నాథ్ బిందాని వారి గది వద్దకు వచ్చి పనికి వెళదామని తలు పుతట్టగా అతనికి విద్యుత్‌షాక్ తగిలింది. వెంటనే ఈ విషయాన్ని బేని బందాని భర్త విద్యాధర్ బిందానికి ఫోన్ చేసి తెలిపాడు. విద్యాధర్ బిందాని వచ్చిన తరువాత విద్యుత్ సరఫరా నిలిపివేసి గదిలోపలికి వెళ్లి చూడగా అప్పటికే తల్లీకూతుళ్లు మరణించి ఉన్నారు. బాబి బిందాని మోచేతి వద్ద విద్యుత్ షాక్‌తో కమిలి పోయిన గాయం ఉంది. అయితే బుధవారం అర్ధరాత్రి వీచిన గాలి వానకు విద్యుత్‌వైర్ తెగి ఇనుప తలుపుపై పడటంతో విద్యుత్ సరఫరా అయి ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

లారీ, కారు ఢీ

కొడుకు మృతి తండ్రికి తీవ్రగాయాలు


మహాజన్ సాయిఅక్షయ్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం/ మెట్‌పల్లి రూరల్, మే 23: ఇబ్రహీం పట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజేశ్వర్‌రావుపేట శివారులో గురువారం మేకువ జామున ఎదురు ఎదురుగా లారీ, కారు ఢీకొన్న ప్రమాదంలో కొడుకు మహాజన్ సాయిఅక్షయ్(19) మృతి చెందగా, తండ్రి మహాజన్ శివరామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి పట్టణానికి చెందిన మహాజన్ సాయిఅక్షయ్ ఇటీవల ఇంటర్ మీడియట్ పూర్తి చేశాడు. కొడుకు ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌లోని కాలేజీల వివరాలను తెలుసుకోవడానికి తండ్రి మహాజన్ శివరామకృష్ణ తన కుమారుడితో కలిసి బుధవారం ఏపీ15బీకే5454 అనే నంబర్ గల కారులో వెళ్లి తిరిగి రాత్రి మెట్‌పల్లికి బయలు దేరారు.

ఈ క్రమంలో గురువారం మేకువ జామున బండలింగాపూర్ గ్రామ శివారులోని గండి హనుమాన్ ఆలయంలో సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నారు. ప్రమాదంలో మహాజన్ సాయిఅక్షయ్ అక్కడికక్కడే మృతి చెందగా శివరామకృష్ణ రెండు కాళ్లు, చేయి విరిగి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108కు సమాచారం ఇవ్వగా గాయాలపాలైన శివరామకృష్ణకు మెట్‌పల్లి ప్రభుత్వ ఆసపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ ఆసపత్రికి తరలించారు. ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించినం దుకు ఆర్యవైశ్య ఆధ్వర్యంలో అవార్డు అందుకొని మంచి భవిష్యత్ ఉన్న సాయిఅక్షయ్ మృతి చెందడం, తండ్రి శివరామకృష్ణ తీవ్ర గాయాలపాలవడంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

విద్యుదాఘాతంతో రైతు మృతి

జమ్మికుంట రూరల్, మే 23: కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన వేల్పుల శ్రీనివాస్ (43) అనే రైతు విద్యుదాఘాతానికి మృతి చెందాడు. బుధవారం అర్ధరాత్రి ఈదురుగాలులు వీచి వర్షం కురిసింది. శ్రీనివాస్ ఇంట్లో సర్వీస్ వైరు లూజు అయి కిందకు వేలాడింది. తెల్లవారు జామున సర్వీస్ వైరును కర్రతో సరిచేసే సమయంలో శ్రీనివాస్ విద్యుదాఘాతానికి గురై అక్కడికి అక్కడే మృతి చెందాడు. శ్రీనివాస్ భార్య మల్లేశ్వరి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.


శ్రీనివాస్ మృతదేహం

వారసంతల్లో వసతులు కరువు

● కొన్ని గ్రామాల్లో నిరుపయోగం ● వారసంతలు నిర్మించినా రోడ్డుపైనే అంగడి



గన్నేరువరంలోని వారసంత



జంగపల్లిలో నిరుపయోగంగా ఉన్న వారసంత

గన్నేరువరం, మే 23: పల్లె ప్రగతిలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాలలో వారసంతలు నిర్మించారు. మండల కేంద్రంలో 21 లక్షల ఈజీఎస్, జీపీ నిధులతో అతిపెద్ద వారసంతను 2021లో నిర్మించారు. ఇందులో 60మందికి పైగా చిరు వ్యాపారులు తమ స్టాళ్లను ఏర్పాటు చేసుకునేందుకు స్థలాన్ని కేటాయించారు. కానీ అందులోని వ్యాపారులకు మాత్రం నీటి వసతిని, టాయిలెట్‌లను ఏర్పాటు చేయడం మరిచారు. దీంతో వారసంతకు వచ్చిన వ్యాపారులు నీటివసతి, టాయిలెట్‌లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి మంగళవారం నిర్వహించే వారసంతకు మండలంలోని పలు గ్రామాలతో పాటు వివిధ మండలాల నుంచి సుమారు వందమంది వివిధ రకాల కూరగాయలు, వస్త్ర వ్యాపారులు వస్తుంటారు. వీరికి వారసంతలో సదుపాయాలు లేక తమ స్టాళ్లను వారసంత ముందు నిర్వహిస్తున్నారు. వారసంతను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో టెండర్లు వేసి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడంతో ప్రతివారం వ్యాపారుల వద్ద ట్యాక్స్‌ను వసూలు చేసినప్పటికీ వారసంతలో వసతులు కల్పించడంలో విఫలం అయ్యారని వ్యాపారులు ఆరోపిస్తున్నారు.

● మండలంలోని జంగపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద నిర్మించిన వారసంత నిరుపయోగంగా మారింది. ఈజీఎస్, గ్రామపంచాయతీ నిధులు రూ.12 లక్షలతో వారసంతను ప్రారంభించి రెండు సంవత్సరాలు పూర్తవుతున్నా ఇప్పటికీ ఒక్కసారి కూడా అందులో వారసంతను నిర్వహించలేదు. జంగపల్లి గ్రామానికి వారసంత కిలోమీటర్ దూరంలో ఉండడంతో వ్యాపారులు, గ్రామస్థులు వారసంతకు రావడానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో పలు పంచాయతీలకు వారసంత అడ్డాగా మారిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోనే వారసంతను ఏర్పాటు చేస్తే బాగుండేదని గ్రామస్థులు కోరుకుంటున్నారు. ప్రభుత్వం లక్షల నిధులు వెచ్చించి ప్రజలకు సౌకర్యవంతంగా వారసంతను నిర్మించి సదుపాయాలు కల్పిస్తే పాలకుల నిర్లక్ష్యం వల్ల నిరుపయోగంగా మారిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

టాయిలెట్‌లు లేక ఇబ్బందులు



మిట్టపల్లి ఈశ్వర్, వస్త్ర వ్యాపారి, ఎలగందల్

గన్నేరువరంలోని వారసంతకు ప్రతివారం వస్తుంటాను. వారసంతను పెద్దగా నిర్మించినప్పటికీ ఇందులో తాగడానికి మంచి నీరు లేక ఇబ్బందులు పడుతున్నాం. టాయిలెట్‌లు లేక పోవడంతో బయటకి వెళ్లలేక అనేక అవస్థలు పడుతున్నాం వారసంత సమస్యలపై పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లా ఫలితం లేదు.

కొత్తపల్లి వాసికి డాక్టరేట్



కామారపు బాల శ్రీప్రసాద్

భగత్‌నగర్, మే 23: కొత్తపల్లి పట్టణానికి చెందిన కామారపు బాల శ్రీప్రసాద్‌కు మహాత్మాగాంధీ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. మహాత్మాగాంధీ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ విభాగం ప్రసాద్ చేసిన అధ్యయనానికి గాను డాక్టరేట్ సాధించారు. తెలంగాణ రాష్ట్రంలో ఎంపిక చేసిన జిల్లాలో వైద్యులతో ఫార్మసీ మందుల ప్రిస్క్రిప్షన్ ప్రవర్తనను ప్రభావితం చేసే అంశాలపై అధ్యయనం చేశారు. నల్గొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ యుసిసిబి డీన్ ప్రొఫెసర్, సూపర్‌వైజర్ బి సరిత పర్యవేక్షణలో డాక్టరేట్ సాధించారు. ప్రసాద్ ప్రస్తుతం విశ్వవిశ్వాని బిజినెస్ స్కూల్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. కొత్తపల్లి పట్టణానికి చెందిన ప్రసాద్ డాక్టరేట్ సాధించడం పట్ల కొత్తపల్లి గ్రామస్థులు, మిత్రులు, అభినందించారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 23: గోవా రాష్ట్రంలో ఈ నెల 25, 26 తేదీలలో నిర్వహించనున్న జాతీయస్థాయి కరాటే పోటీలకు జిల్లా కేంద్రంలోని దమ్మికకాయ్ షిటోరియా కరాటే అకాడమీ క్రీడాకారులు ఎంపికయ్యారు. కుమిటి, కటాఫ్, విభాగాలలో ఐదుగురు క్రీడాకారులు జాతీయ పోటీలకు ఎంపికయ్యారని అకాడమీ చీఫ్ ఆర్ ప్రసన్నకృష్ణ తెలిపారు. అండర్-14 విభాగంలో మధుశ్రీ, శ్రీతిక్ నందన్, ఆదిత్యసాయి, అబో-14 విభాగంలో జె శ్రీచరణ్, బి మణితేజ ఎంపికయ్యారని తెలిపారు. జాతీయపోటీలకు ఎంపికైన క్రీడాకారులను తెలంగాణ రాష్ట్ర కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు ఈ శ్రీనివాస్, అకాడమి అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్న కృష్ణ, బండారి సంతోష్, కోచ్ ఎ వినోద్ అభినందించారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్,మే 23: నగరంలో శుక్రవారం ఉదయం 8:30 గంటల నుంచి 11 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు ఏడిఈ సుధీర్ కుమార్ తెలిపారు. వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయు ప్రాంతాలు వెంకటేశ్వర కాలనీ రామచంద్రపురం కాలనీ, ఎర్రగుట్ట కాలనీ, వాసుదేవా కాలనీ,శ్రీ రామకాలనీ, శక్తి దేవాలయం , సంతోష్‌నగర్, విద్యానగర్, బాలాజీ సూపర్ మార్కెట్ ప్రాంతం, సెయింట్ జాన్స్‌పాఠశాల ప్రాంతం, వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

కుట్ర కేసును వెనక్కి తీసుకోవాలి

భగత్‌నగర్, మే 23: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎం వెంకటరెడ్డిపై నమోదు చేసిన కుట్ర కేసును వెనక్కి తీసుకోవాలని పిడిఎస్‌యు రాష్ట్ర కోశాధికారి రత్నం రమేష్ డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేస్తామని ప్రకటించి దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు.

తప్పుడు రిజిస్ట్రేషన్ కేసులో ఇద్దరి అరెస్టు

కరీంనగర్ క్రైం, మే 23 : నకిలీ రశీదు, ఫొటోలను సృష్టించి దాని ద్వారా రేకుర్తి గ్రామ పంచాయతీ నుంచి తప్పుడు ఇంటి నిర్మాణం అనుమతి, ఇంటి నెంబరు పొంది ఆ పత్రాలతో తప్పుడు రిజిస్ట్రేషన్ చేసి 30 లక్షల రూపాయలను దోపిడీకి పాల్పడ్డ కేసులో నలుగురు నిందితులపై కేసు నమోదు చేశామని కరీంనగర్ రూరల్ సీఐ ఎ ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఈ కేసులో జక్కుల మల్లేశంగౌడ్, మొహమ్మద్ ఇక్బాల్‌లను కొత్తపల్లి పోలీసులు గురువారం రాత్రి అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. రేకుర్తి శివారులోని ఐదు గుంటల స్థలం ఇంటినెంబరు 4-56/11/ 2/2/2/ ఏ/1ను ఎటువంటి సర్వే నెంబర్ లేకుండా షేక్ అలీ బిన్ బావజీర్ అనే వ్యక్తితో డాక్యుమెంట్ నెంబర్ 2847/2023 ద్వారా కరీంనగర్ కిసాన్‌నగర్‌కు చెందిన మారుతీ రాజ్‌కుమార్ పేరిట తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించారు. ఆ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ తీసుకున్న అనంతరము బాధితుడు రాజ్‌కుమార్ ఆ స్థలం వద్దకు వెళ్లి చూడగా అక్కడ ఎటువంటి ఇల్లు నిర్మాణం లేదు, ఆ స్థలం వేరొకరిదని వెల్లడైంది. మోసపోయి నట్లు తెలుసుకున్న రాజ్‌కుమార్ కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు మోసం చేసి 30 లక్షల రూపాయలను కాజేసిన నలుగురు మహమ్మద్ ఇక్బాల్, జక్కుల మల్లేశం, షైక్ అలీబిన్ బావాజీర్, గాలిపల్లి సంతోష్‌లపై 120 బి, 420, 467, 468, 471, 506, రెడ్‌విత్ 34 ఐపీసీ ప్రకారం కేసు నమోదు చేసి మహ్మద్ ఇక్బాల్, జక్కుల మల్లేశంలను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరచగా జడ్జి ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు జైలుకు తరలించారు.

విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి

హుజూరాబాద్, మే 23: ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం హుజూరాబాద్ పట్టణంలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గాడి తప్పిన విద్య వ్యవస్థను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సరిదిద్దాలని కోరారు. ప్రైవేట్ సంస్థలు విద్య వ్యాపారం చేస్తూ ఫీజుల పేరుతో లక్షలాది రూపాయలు దోచుకుంటున్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ప్రైవేట్ విద్యా సంస్థలు చేస్తున్న ఫీజుల దోపిడీని అరికట్టే విధంగా చర్యలు తీసుకుని ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్, జిల్లా సహాయ కార్యదర్శి రాము, మండలాధ్యక్షుడు వేణుగోపాల్, నాయకులు రోహిత్, కృష్ణ, వంశీ, రవి పాల్గొన్నారు.

వంట గ్యాస్ వినియోగంపై అవగాహన

హుజూరాబాద్, మే 23: పట్టణంలో వంట గ్యాస్ వినియోగంపై ప్రజలకు గురువారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ డీలర్ల పూర్వ ప్రధాన కార్యదర్శి పీవీ మదన్‌మోహన్‌రావు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ లీకేజీ వాసన గుర్తిస్తే 1906 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. గ్రీన్ రబ్బరు ట్యూబ్, నాన్ ఐఎస్ఐ రబ్బరు ట్యూబుల వాడకం ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో ఇండియన్ గ్యాస్ మేనేజర్ దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పునకు సహకరించాలి

శంకరపట్నం, మే 23: మండలంలోని తాడికల్‌లో జాతీయ రహదారి వెడల్పునకు ప్రజలు సహకరించాలని పంచాయతీ కార్యదర్శి సమ్మ రాజేశ్వర్ కోరారు. గురువారం మండలంలోని తాడికల్‌లో హైవేను అనుకొని ఉన్న షాప్స్, హోటల్స్ నిర్వాహకులకు ఆయన నోటీసులు అందజేశారు.

చిగురుమామిడి ప్రెస్ క్లబ్ అడహక్ కమిటీ ఎంపిక





గాదె రఘునాథరెడ్డి, పత్తెం రమేష్ పటేల్

చిగురుమామిడి, మే 23: చిగురుమామిడి మండల ప్రెస్‌క్లబ్ అడహక్ కమిటీ కన్వీనర్‌గా పత్తెం రమేష్‌పటేల్, కోకన్వీనర్ గాదె రఘునాథరెడ్డిని ఎంపిక చేసినట్లు హుస్నాబాద్ డివిజన్ ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడు మార్త ప్రకాష్ తెలిపారు. మండలం లోని సుందరగిరిలో గురువారం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ హుస్నాబాద్ డివిజన్ ప్రెస్‌క్లబ్ అద్వర్యంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) అనుబంధంగా మండల కమిటీని నియమించినట్లు తెలిపారు. సభ్యులుగా బొల్లుమల్ల రాజమౌళి, నరసింహాచారి, జేరిపోతుల సదానందంను ఎంపిక చేశామని చెప్పారు.

133వ ఎన్నీల ముచ్చట్లు

కరీంనగర్ కల్చరల్, మే 23: నగర శివారులోని రేకుర్తి ఎస్ఆర్ఆర్ కళాశాల హిందీ సహాయాధ్యాయుడు వాసాల వరప్రసాద్ నివాసంలో గురువారం రాత్రి 133వ ఎన్నీల ముచ్చట్లు నిర్వహించారు. ఈ సందర్భంగా తెరవే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూర్ల వేంకటేశ్వర్లు మాట్లాడుతూ మానవ జీవితంలోని సంఘర్షణలు, సంక్లిష్టతల మబ్బులు వీడాలంటే సాహిత్య పఠనం ఎంతో అవసరమని అన్నారు. ఇంటింటా సాహిత్య క్రాంతిని పంచే మహత్తర సాహిత్య కార్యక్రమం ఎన్నీల ముచ్చట్లని ఆయన అన్నారు. పలువురు కవులు, రచయితలు తమ కవితలను వినిపించారు. ఈ కార్యక్రమంలో తెరవే జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సివి కుమార్, దామెరకుంట శంకరయ్య, పీఎస్ రవీంద్ర, నడిమెట్ల రామయ్య, ఇటిక్యాల రాము, యుగేందర్, శ్రీనివాస్, విలాసాగరం రవీందర్, మేరుగు ప్రవీణ్, నసీరొద్దీన్, మధుశ్రీ, అఖిల్‌కుమార్, కిషోర్, శంకర్, చైతన్య, సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణం

కరీంనగర్ కల్చరల్, మే 23: దేవాదాయశాఖ పరిధిలోని జిల్లా కేంద్రం మార్కెట్‌రోడ్‌లో గల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం అలర్‌మేలుమంగా పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణదాతలకు లడ్డూలు, శేష వస్త్రాల్ని అందించారు. అనంతరం అన్నదానం జరిగింది. కల్యాణంలో గోగుల ప్రసాద్, బొజ్జ రేవతి ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు అలరించాయి. సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ, రాత్రి పుర వీధుల్లో గరుడ వాహనసేవ కన్నుల పండువలా ఆలయం నుంచి ప్రారంభమై ప్రకాశం గంజ్ గణపతి ఆలయం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమాల్లో ఆలయ వ్యవస్థాపక వంశీయ ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈఓ వుడుతల వెంకన్న పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తున్న కళాశాలలను సీజ్‌చేయాలి

భగత్‌నగర్, మే 23: ఇంటర్‌బోర్డు నిబంధనలను ఉల్లంఘిస్తున్న నగరంలోని కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలను సీజ్ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి మహేందర్, బ్రాహ్మణపల్లి యుగేందర్‌లు డిమాండ్ చేశారు. ఇంటర్ బోర్డు నిబంధనలను ఉల్లంఘిస్తూ వేసవి తరగతులు నిర్వహిస్తున్న కళాశాలలపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. తక్షణమే కార్పొరేట్ కళాశాలల ఆగడాలను అడ్డుకట్టవేయాలని లేకపోతే కార్పొరేటర్ విద్యా సంస్థలపై దాడులు చేస్తామని హెచ్చరించారు.

● అనుమతులు లేకుండా అడ్మిషన్లు చేస్తున్న శ్రీచైతన్య పాఠశాలను మూసివేసి క్రిమినల్ చర్యలు చేపట్టాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. పర్మిషన్ లేకుండానే తల్లిదండ్రులను మోసం చేస్తూ అడ్మిషన్లు చేస్తున్నారన్నారు.

ఘనంగా అన్నమయ్య జయంతి



అన్నమయ్య జయంతి ఉత్సవంలో పాల్గొన్న అన్నమయ్య ఆరాధనా అసోసియేషన్ బాధ్యులు

కరీంనగర్ కల్చరల్, మే 23: పద కవితా పితామహుడు, తాళ్లపాక అన్నమాచార్యుల 616వ జయంతి ఉత్సవాన్ని నగరంలోని మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరాలయం ముందు గల అన్నమయ్య విగ్రహం వద్ద అన్నమయ్య ఆరాధనా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అన్నమయ్య సంకీర్తనలు ఆలపించి పూజలు జరిపారు. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు చిలుకపాటి హనుమంతరావు, కెబి శర్మతో పాటు గోగుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా వేంకటేశ్వర కల్యాణం



సుందరగిరిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చిగురుమామిడి, మే 23: మండలంలోని సుందరగిరి వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. స్వామి వారికి హైదరాబాద్‌కు చేందిన దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు మధుసూదనా చార్యులు, శేషం సుదీరాచార్యులు, నవీన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● మానకొండూర్: మానకొండూర్‌లో జరుగుతున్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శకటోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతులు ఎడ్ల బండ్లలో ఆలయానికి చేరుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. 25న రథోత్సవంతోపాటు జాతర జరుగుతుందని ఈవో తెలిపారు.

● తిమ్మాపూర్: మండలంలోని నేదునూర్ రంగనాథ స్వామి ఆలయంలో గురువారం గోధా రంగనాథ స్వామి కళ్యాణాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, ధ్వజరోహణం లాంటి కార్యక్రమాలను తిరుక్కొవెల సాయినాథ ఆచార్యులు ఆద్వర్యంలో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ ఒంటెల శ్రీనివాస్‌రెడ్డి, ఒంటెల రవీందర్‌రెడ్డి, ఎడమ శ్రీరంగారెడ్డి, ఒంటెల నరేందర్‌రెడ్డి, ఒంటెల మల్లారెడ్డి, ఒంటెల నారాయణరెడ్డి పాల్గొన్నారు.

యూనిఫాం తయారీ కేంద్రం పరిశీలన



యూనిఫారాల తయారీని పరిశీలిస్తున్న స్వరూపారాణి

చొప్పదండి, మే 23: పట్టణంలోని యూనిఫాం తయారీ కేంద్రాన్ని మెప్మా సంచాలకురాలు స్వరూపారాణి గురువారం సందర్శించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో మెప్మా కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, మెప్మా డీఎంసీ శివాని, ఏడీఎంసీ మానస, ఆర్‌పీలు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్రకు విరాళం

వీణవంక, మే 23: మండల కేంద్రంలో హనుమాన్ భక్తులు నిర్వహించే శోభాయాత్రకు యూప్ టీవి అధినేత పాడి ఉదయనందన్‌రెడ్డి 10,016 రూపాయల విరాళం తన ప్రతినిధుల ద్వారా గురువారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దాసారపు ప్రభాకర్, అమృత ప్రభాకర్, సమిళ్ల చిట్టి, మంతెన శ్రీధర్, కుమారస్వామి, వంశీకృష్ణ, తోట్ల రాకేష్, సిరిగిరి రాజశేఖర్, కోరే రాకేష్ పాల్గొన్నారు.

'చెరువులో మట్టి తవ్వకాలు ఆపాలి'

రామడుగు, మే 23: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామంలోని ఊర చెరువులో రైల్వే నిర్మాణ పనుల కోసం చేస్తున్న మట్టి తవ్వకాలను ఆపాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు గురువారం రైతులు, గ్రామస్థులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి మాజీ అధ్యక్షులు ఎల్కపల్లి లచ్చయ్య, అమిరిశెట్టి సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి నైపుణ్యాభివృద్ధి శిక్షణ శిబిరం

హుజూరాబాద్, మే 23: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమెరికన్-ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం తిరుమల మాట్లాడుతూ విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గొని పలు అంశాలు నేర్చుకున్నారన్నారు. అనంతరం విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలను ప్రాజెక్టుల రూపంలో తరగతి గదుల్లో ప్రదర్శించారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అమెరికన్-ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు శృతి, జస్టి అలెక్స్, మహేందర్, మహేష్, స్వప్న, ఉపాధ్యాయులు ఆసియా, సొల్లు సారయ్య, కొండ సత్యం పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి రూ. ఆరు కోట్లు మంజూరు



రోడ్డు పనులపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు, మే 23: మండలంలోని గోపాల్‌రావుపేట్ నుంచి గంగాధర మండలం బూరుగుపల్లి రోడ్డు నిర్మాణానికి ఆరు కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. గురువారం ఆయన గోపాల్‌రావుపేట వద్ద రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ జవ్వాజి తిరుపతి, బొమ్మెరవేని తిరుపతి, కోల రమేశ్ పాల్గొన్నారు.

● గంగాధర: మండలంలోని లింగంపల్లిలో గురువారం జరిగిన పోచమ్మ బోనాలకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారికి మొక్కుకున్నానన్నారు. అనంతరం బూరుగుపల్లికి వెళ్లి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్రం తిరుపతిగౌడ్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మనోహర్, అజయ్‌రావు, మాజీ సర్పంచ్ అంజయ్య ఉన్నారు.

భూమి విక్రయిస్తానని మోసం

● నిందితుడి అరెస్టు, జైలుకు తరలింపు

కరీంనగర్ క్రైం, మే 23: తనది కాని భూమిని విక్రయిస్తానని చెప్పి 36 లక్షల రూపాయల వసూలు చేసి దోపిడీకి పాల్పడ్డ ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు కాగా కొత్తపల్లి పోలీసులు ఒక నిందితుడిని అరెస్ట్‌చేసి జైలుకు తరలించారు. కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కొత్తపల్లికి చెందిన కూరపాటి వెంకటేష్ ఇరుకుల్ల గ్రామంలో తన పేరిట 43 గుంటల భూమిని ఉందని చెప్పి కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో డాక్టర్ ప్రవీణ్‌సింగ్ నాయక్‌కు విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకుని వివిధ సందర్భాల్లో 36 లక్షలు వసూలు చేశాడు. ఆ భూమిని రిజిస్టర్ చేయ కుండా, వాయిదా వేస్తూ వచ్చాడు. అయితే తనకు భూమి విక్రయించేందుకు అగ్రిమెంట్ చేసిన కూరపాటి వెంకటేష్‌కు భూమిలేదని తెలిసింది. ఈ మేరకు బాధితుడు ప్రవీణ్‌సింగ్ నాయక్ కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఇద్దరిపై 402 రెడ్‌విత్ 34 ఐపీసీ కింద కేసు నమోదు చేసి కూరపాటి వెంకటేష్‌ను గురువారం అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరచగా, జడ్జి అతనికి 14 రోజుల రిమాండ్ విధించగా పోలీసులు జైలుకు తరలించారు.

'దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

కరీంనగర్ క్రైం, మే 23: తాను ఒక యువతి గత రెండు సంవత్సరాలుగా ప్రేమించు కుంటున్నామని, ఈ నెల 14న బైక్‌పై రేకుర్తికి వెళ్తుండగా కొందరు యువకులు అడ్డుకుని దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని, వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని రామగుండంలో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న చింతా భరత్ తెలిపాడు. ఆయన గురువారం సుభాష్‌నగర్‌లోని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యాలయంలో భజరంగ్‌దళ్ జోనల్ కన్వీనర్ తోట ప్రదీప్‌కుమార్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ పెద్దపల్లి ఫ్లైఓవర్ వద్ద ఆరుగురు యువ కులు తన వెంటపడి రేకుర్తిలో అడ్డుకుని దాడిచేసి కొట్టారని ఆరోపించారు. అనంతరం తనను మాజీ మేయ ర్ అబ్బాస్‌షమీ ఇంటికి తీసుకువెళ్లి చిత్రహింసలకు గురిచేశారని భరత్ ఆరోపించాడు. మొబైల్‌ఫోన్‌ను పగులగొట్టి, బైక్‌ను ధ్వంసం చేశారన్నారు. ఈ విషయంపై కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. మాజీ మేయర్ అబ్బాస్‌షమీతో తనకు ప్రాణహాని ఉందని, ఆయనను పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని విజ్ఞప్తి చేశాడు. విలేకరుల సమావేశంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి విద్యాసాగర్, బజరంగ్‌దళ్ జోనల్ కన్వీనర్ తోట ప్రదీప్‌కుమార్, బజరంగ్ దళ్ జిల్లా కో కన్వీనర్ కన్నం శంకర్, ఎస్సీ పరిరక్షణ సమితి అధ్యక్షుడు దావు సంతోష్, గౌతమ్, సందీప్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నగర కాంగ్రెస్ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ ఆసిఫ్

కరీంనగర్ అర్బన్, మే 23 : నగర కాంగ్రెస్ మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ ఆసిఫ్‌ఖాన్‌ను నియమిస్తూ మైనార్టీ సెల్ నగర కాంగ్రెస్ అధ్యక్షులు అహమ్మద్ అలీ గురువారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆసిఫ్‌ఖాన్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యే కవ్వం పల్లి సత్యనారాయణ, నియోజకవర్గ ఇంచార్జి పురుమళ్ల శ్రీనివాస్, నగర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఏ మోసిన్, ఎంఏ కరీం, సలీంలకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

యజ్ఞవరాహక్షేత్రంలో నేటి నుంచి విశేష కార్యక్రమాలు

కరీంనగర్ కల్చరల్, మే 23: లోక కల్యాణార్థం నగరంలోని యజ్ఞవరాహక్షేత్రంలో శుక్ర, శని, ఆది వారాల్లో వరాహ మూలమంత్ర సుదర్శన మహామంత్ర సహిత, శ్రీరామ షడక్షరీ సంపుటిత సుందరకాండ హోమం నిర్వహిస్తున్నట్లు సర్వవైదిక సంస్థానం ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాదశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం అంకురార్పణ, సుందరకాండ హవన ప్రారంభం, శనివారం హవనం కొనసాగింపు, ఆదివారం సుదర్శనహోమం, మహాపూర్ణాహుతి ఉంటాయని పేర్కొన్నారు. మూడు రోజుల పాటు సాయంత్రం 6-30 గంటల నుంచి సుందరకాండపై భద్రాద్రి దేవస్థానం స్థానాచార్యులు కెఇ స్థలశాయిస్వామి ప్రవచనం ఉంటుందని తెలిపారు. భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు త్వరగా పూర్తి చేయాలి

రామడుగు, మే 23: అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ అధికారులను ఆదేశించారు. మండలంలోని మోతె, చిప్పకుర్తి గ్రామాల్లోని అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న పనులను ఆయన గురువారం పరిశీలించారు. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యే నాటికి పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ బాస్కర్, ఎంపీడీవో రాజేశ్వరీ, ఎంఈవో వేణు కుమార్ పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో ఎమ్మెల్సీ పూజలు

మానకొండూర్, మే 23: మండలంలోని ముంజంపల్లిలో జరుగుతున్న రేణుకా ఎల్లమ్మ బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పాల్గొని గురువారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ, పీఎంటీఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగపురి తిరుపతిగౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు ఏగోలపు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ జయంతి

చొప్పదండి, మే 23: చొప్పదండిలో ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆద్వర్యంలో బుద్ధ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ బుద్ధుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కదారి గంగరాజు, ప్రధానకార్యదర్శి కల్లెపల్లి అరవింద్, కొత్తూరి మహేశ్, గొల్లపల్లి మోహన్, గాదం రాజమల్లయ్య, సముద్రాల అంజయ్య, కల్లెపల్లి కనకయ్య పాల్గొన్నారు.

● సాయిబాబా ఆలయంలో బుద్ధపూర్ణిమను పురస్కరించుకుని సాయి మహిళ సేవా సమితి ఆద్వర్యంలో సాయి చాలీసా పారాయణం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి'

చిగురుమామిడి, మే 23: రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతూ మండలంలోని గాగి రెడ్డిపల్లి గ్రామస్థులు గురువారం రోడ్డుపై బైఠాయిం చి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ రోడ్డు సౌకర్యం లేక పిల్లలు పాఠశాలకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కాంట్రాక్టర్లతో అధికారులు కుమ్మక్కై పనుల్లో జాప్యం జరుగుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో మంద శ్రీనివాస్, చంద్రయ్య, రాజిరెడ్డి పాల్గొన్నారు.